AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

15-12-2025 (Monday) MAIN EDITION

## ఢిల్లీలో భారీగా విమానాల రద్దు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఢిల్లీని వాయు కాలుష్యం వీడడంలేదు. గాలి నాణ్యత మరింత పడిపోయింది. నగరాన్ని పొగ మంచు కమ్మేసింది. దీంతో సోమవారం అనేక విమానాలు రద్దయ్యాయి. దాదాపు 170 విమానాలను రద్దు చేశారు. అనేక ఫ్లైట్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. రైళ్లు షెడ్యూల్ ప్రకారం గంటల తరబడి ఆలస్యంగా నడిచాయి. నగరం అంతటా పొగమంచు ఉండటంతో ఉదయం వాహనాలు నెమ్మదిగా సాగడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది.

## కొడుకుపై తండ్రి విజయం



**అక్షరటుడే, మెదక్ :** మెదక్ జిల్లా రామాయంపేట మండలం జాన్సీ లింగాపూర్‌లో కొడుకుపై తండ్రి గెలిచాడు. గ్రామానికి చెందిన రామకిష్టయ్య ఆయన కుమారుడు వెంకటేశ్ సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచారు. ఇద్దరు హోరాహోరీగా ప్రచారం చేశారు. ఈ క్రమంలో ప్రజలు తండ్రి రామకిష్టయ్య వైపు మొగ్గు చూపారు. దీంతో ఆయన తన కుమారుడిపై 99 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు.

## అఖండ 2 చూడనున్న ప్రధాని మోదీ




**అక్షరటుడే, హైదరాబాద్ :** బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన అఖండ 2 శుక్రవారం విడుదలైన విషయం తెలిసిందే. ఈ సినిమాను ప్రధాని నరేంద్ర మోదీ చూడనున్నట్లు దర్శకుడు బోయపాటి తెలిపారు. అఖండ 2 గురించి విన్నారని పేర్కొన్నారు. సినిమాపై ఆసక్తి చూపించారని చెప్పారు. త్వరలో ఢిల్లీలో మూవీ స్పెషల్ షో ఏర్పాటు చేస్తామన్నారు.

## ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు..




**అక్షరటుడే, ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. తర్వాత కాస్త కోలుకున్నాయి. ఆటో, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కనిపించగా.. ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్ సూచీలను నిలబెట్టాయి.

## ఆఫీస్‌లో కూర్చొని వార్డుల విభజన



**అక్షరటుడే, హైదరాబాద్ :** జీహెచ్ఎంసీ వార్డుల విభజనపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆఫీసులో కూర్చుని వార్డులను విభజించారని ఆరోపించారు. సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఎందుకు అంత తొందర అని ప్రశ్నించారు.

## ఎస్సై పదవికి రాజీనామా.. సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి

**అక్షరటుడే, సూర్యాపేట :** ఎస్సై పదవికి రాజీనామా చేసి సర్పంచ్‌గా పోటీ చేసిన అభ్యర్థి ఓటమి పాలయ్యాడు. కోదాడ టౌన్ ఎస్సైగా పని చేస్తున్న పులి వెంకటేశ్వర్లు ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఐదు నెలల సర్వీస్ ఉండగానే స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగాన్ని వదులుకొని తన స్వగ్రామం కోదాడ మండలం గుడిబండ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేశాడు. ఈ ఎన్నికల్లో ఆయనకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన భార్య పద్మావతి మద్దతు తెలిపారు. అయినా కూడా గ్రామంలో కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థి విజయం సాధించాడు. రెబెల్ అభ్యర్థి నాగయ్య చేతిలో వెంకటేశ్వర్లు పది ఓట్ల తేడాతో ఓడిపోయారు.

## హెచ్–1బీ, హెచ్–4 వీసాల రద్దు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికా ప్రభుత్వం మరో బాంబు పేల్చింది. ఇప్పటికే కొత్త వీసాల జారీకి సోషల్ మీడియా వెట్టింగ్ అమలు చేస్తున్న యూఎస్.. తాజాగా పాత హెచ్-1బీ, హెచ్ -4 వీసాలను సైతం భారీగా రద్దు చేసింది. తాత్కాలిక వర్కింగ్ వీసాల్ని రద్దు చేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు వీసాలు రద్దయినట్లు ప్రభావిత వీసాదారులకు మెయిళ్లు వస్తున్నాయి. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ వీసాలను ఎక్కువగా భారత వృత్తి నిపుణులు తీసుకుంటారు. ముందు జాగ్రత్తగా వీటిని రద్దు చేస్తున్నామని, తిరస్కరించడం లేదని తెలిపింది. తాత్కాలిక రద్దుతో ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న వారిపై ప్రభావం పడదని సమాచారం. వీసా గడువు ముగిసేవరకు అక్కడే ఉండొచ్చు.



> బంగారం ధర గుబులు పుట్టిస్తోంది. రాకెట్ వేగంతో రేటు పెరుగుతోంది. మరి కొద్ది రోజులలో పెళ్లిళ్ల సీజన్ మొదలు కానుండగా, పసిడి ధరలు ఇప్పుడు ఆల్ టైం హైకి చేరుకోవడం అందరినీ ఉలిక్కిపడేలా చేస్తోంది. రానున్న రోజులలో ఇంకెంత వరకు పెరుగుతుందోనని అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
>
> –అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# బంగారం ధరలకు రెక్కలు

- ఆల్ టైమ్ హై చేరిన పసిడి
- 10 గ్రాముల బంగారం ధర లక్షా 37 వేల పైనే..!
- రూపాయి బలహీనపడటంతో.. పెరుగుతున్న రేట్లు

బంగారం కొనాలనుకునే వారికి ఊహించని షాక్ తగిలింది. ధరలు భారీగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తుంది. తాజాగా కొత్త ఆల్ టైమ్ హైని పసిడి టచ్ చేసింది. వెండి కూడా బంగారం కంటే స్పీడ్‌గా పెరుగుతూ ఆల్ టైమ్ హై రికార్డ్ సృష్టించింది. గత వారం కాస్త శాంతించినట్లు కనిపించిన పసిడి ధరలు మళ్లీ ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ట్రేడింగ్ ప్రారంభమైన కాసేపటికే బంగారం ధరలు పైపైకి ఎగబాకుతూ కొత్త రికార్డులను నమోదు చేశాయి. సోమవారం మధ్యాహ్నం దేశవ్యాప్తంగా 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర 1,37,430 కి చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర 1,25,850 పలుకుతుంది.

### రూ.రెండు లక్షలు దాటిన వెండి

బంగారంతో పాటు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలో వెండి ధర సుమారు రూ.3,000 పెరిగి దేశవ్యాప్తంగా రూ.2,00,900 స్థాయికి చేరడం గమనార్హం. గత 8 రోజుల్లో కిలో వెండిపై ఏకంగా రూ.17 వేలు పెరిగడం అందరిని ఆశ్చర్య పరుస్తుంది.. ప్రస్తుతం మార్కెట్‌లో తులం వెండి రూ.2,130కి లభిస్తోంది. చెన్నైలో కిలో వెండి ధర రూ.2,13,000ను తాకగా, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లోనూ దాదాపు ఇదే స్థాయిలో ధరలు కొనసాగుతున్నాయి. పలు నగరాల్లో వెండి ధరలు రెండు లక్షల మార్కును దాటడం మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### సురక్షిత పెట్టుబడి

భారతదేశంలో బంగారం కేవలం ఆభరణంగా మాత్రమే కాకుండా సంప్రదాయం, పెట్టుబడిగా కూడా విడదీయరాని భాగంగా మారింది. ముఖ్యంగా పెళ్లిళ్లు, పండుగల సమయంలో బంగారం కొనుగోలు చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అదే సమయంలో చాలామంది దీన్ని సురక్షిత పెట్టుబడిగా భావిస్తూ కొనుగోలు చేస్తుంటారు.

### కారణాలివే..

భారత్ -అమెరికా మధ్య ఒప్పందంపై కొనసాగుతున్న సందిగ్ధత, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బలహీనపడడం, అలాగే అమెరి కా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోతపై అంచనాలు పెరగడం వంటి అంశాలు పసిడి, వెండి ధరలకు రెక్కలొచ్చేలా చేస్తున్నాయని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఈ పరిస్థితులు కొనసాగితే రానున్న రోజుల్లో కూడా బంగారం, వెండి ధరలు అధిక స్థాయిలోనే కొనసాగే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటీవల అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను 0.25 శాతం మేర తగ్గించడంతో బంగారం, వెండి ధరలపై ప్రత్యక్ష ప్రభావం కనిపిస్తోందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా రాజ్‌కుమార్



**అక్షరటుడే, ఢిల్లీ:** కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా రాజ్‌కుమార్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించారు. రాజ్‌కుమార్‌తో పాటు మరో 8 మందిని సమాచార కమిషనర్లుగా ప్రధాని మోదీ నేతృత్వంలోని కమిటీ సిఫార్స్ చేసింది. రాజ్‌కుమార్ గతంలో న్యాయశాఖ కార్యదర్శిగా పని చేశారు.

## ప్రభుత్వ వ్యతిరేకతకు సర్పంచ్ ఎన్నికలే నిదర్శనం : కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్ :** దేశ చరిత్రలో పంచాయతీ ఎన్నికల్లో ఏ ముఖ్యమంత్రి ప్రచారం చేయలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ అభ్యర్థులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో సీఎం ప్రచారం చేసినా.. బీఆర్ఎస్ సత్తా చాటిందన్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ గెలుపొందిందని పేర్కొన్నారు. అడ్డదారిలో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఇక కాలం చెల్లిందని పల్లె ప్రజలు ఓటు ద్వారా తేల్చి చెప్పారన్నారు. ప్రభుత్వ పెద్దలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ ఓడిపోయిందని చెప్పారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి పంచాయతీ ఎన్నికలు నిదర్శనం అని తెలిపారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని కేటీఆర్ అన్నారు.

## పార్లమెంట్‌లో గందరగోళం



**అక్షరటుడే, ఢిల్లీ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సోమవారం గందరగోళం నెలకొంది. సభ ప్రారంభం కాగానే.. అధికార, విపక్ష పార్టీల సభ్యులు ఆందోళన చేపట్టారు. దేశంలో ఓటు చోరీ జరుగుతోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం మహాధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ధర్నాలో ప్రధానిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పలు వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీకి సమాధి తవ్వాలంటూ ధర్నాలో నినాదాలు చేశారని, ప్రధానిని చంపాలని పిలుపునిచ్చారా అంటూ కాంగ్రెస్‌పై బీజేపీ నాయకులు మండిపడ్డారు.

## మన పర్వతంపై అమెరికా నిఘా పరికరం : బీజేపీ ఎంపీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** మాజీ ప్రధాన మంత్రులు నెహ్రూ, ఇందిరా గాంధీపై బీజేపీ నేత, ఎంపీ నిశికాంత్ దూబే సంచలన వ్యాఖ్యలు చేశారు. మన దేశంలోని ఒక పర్వతంపై అమెరికా నిఘా పరికరం ఏర్పాటుకు వారు అనుమతి ఇచ్చారని ఆరోపించారు. చైనాపై నిఘా పెట్టేందుకు 1960వ దశకంలో హిమాలయాలలోని నందా దేవి శిఖరంపై అణుశక్తితో పనిచేసే నిఘా పరికరాలను ఏర్పాటు చేయడానికి అమెరికా సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ)కి అనుమతి ఇచ్చారని దూబే ఆరోపించారు. 'ఎక్స్' వేదికగా ఆయన దీనిపై పలు పోస్టులు పెట్టారు. అమెరికన్ ఏజెంట్లు వెనక్కి వెళ్లిపోయిన తర్వాత ఆ అణుశక్తి గూఢచర్య పరికరాలను పర్వతంపైనే వదిలేశారని ఆరోపించారు. దీంతో గంగా నది ఒడ్డున నివసించే ప్రజలలో క్యాన్సర్ పెరుగుతుందన్నారు. హిమానీనదాలు కరగడానికి, మేఘ విస్ఫోటనాలకు, ఇళ్లలో పగుళ్లు ఏర్పడటానికి ఇదే కారణమా అని ప్రశ్నించారు.

## వైసీపీ ర్యాలీలో రప్పా, రప్పా పోస్టర్లు



**అక్షరటుడే, అమరావతి :** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏపీలో వైసీపీ నాయకులు కోటి సంతకాలు సేకరించారు. ఆ సంతకాల ప్రతులను గవర్నర్‌కు సమర్పించేందుకు సోమవారం భారీ ర్యాలీలు నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల ప్రతులను విజయవాడకు తరలించారు. శివాలయం చెక్ పోస్టు నుంచి బంగ్లా సర్కిల్ వరకూ వైసీపీ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీలో వైసీపీ కార్యాలయం వద్ద 'గంగమ్మ జాతరలో పొట్టేలు నరికినట్లు ఒక్కొక్కడిని రప్పా, రప్పా' అంటూ పోస్టర్లతో కార్యకర్తలు హంగామా చేశారు.

## ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా షెఫాలి వర్మ




**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** భారత మహిళా క్రికెటర్ షెఫాలి వర్మ నవంబర్ 2025గాను ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును గెలుచుకుంది. భారత మహిళల జట్టు 2025 వన్డే ప్రపంచ కప్ సాధించిన విషయం తెలిసిందే. కాగా.. టోర్నీ చివరలో ప్రతీక రావల్ గాయపడగా.. షెఫాలి జట్టులోకి వచ్చింది. సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చింది. కాగా.. ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు దక్కడంపై షెఫాలి సంతోషం వ్యక్తం చేసింది.

## రెయిలింగ్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు



**అక్షరటుడే, శ్రీశైలం :** ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉండే రెయిలింగ్‌ను ఢీకొంది. ప్రకాశం జిల్లా దోర్నాల - శ్రీశైలం ఘాట్‌లో సోమవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. మూలమలుపు వద్ద భవానీ మాలధారులతో శ్రీశైలం వెళ్తున్న ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీకొంది. దీంతో భవానీ స్వాములు ఆందోళనకు గురయ్యారు. బ్రేక్ ఫెయిల్ కావడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అయితే బస్సు కొంచెం ముందుకు వెళ్తే లోయలో పడిపోయేది. కరెక్ట్‌గా రెయిలింగ్, సైడ్ వాల్‌ను ఢీకొని ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## 'ఓట్ల చోరీ' అంశం 'ఇండియా' కూటమికి సంబంధం లేదు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఓట్ల చోరీ ఆరోపణలపై ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలోని ఎన్‌సీ నేత, జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. ఓట్ల చోరీ అంశాన్ని కాంగ్రెస్ లేవనెత్తుతోందని, దీనికి 'ఇండియా' కూటమికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'ఇండియా కూటమికి ఈ వ్యవహారంతో ఎటువంటి సంబంధం లేదు. ప్రతి పార్టీకి తన సొంత అజెండాను నిర్దేశించుకునే స్వేచ్ఛ ఉంది. ఓట్ల చోరీ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లను హస్తం పార్టీ తన ప్రధాన అంశాలుగా చేసుకుంది. ఏం చేయాలో వాళ్లకి మనం చెప్పలేం కదా!'' అని అన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ ఢిల్లీలో 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' బహిరంగ సభ నిర్వహించిన మరుసటి రోజే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.